# "బ్రహ్మ"



గాయత్రీ రామోజి

**తూ**రుపుతీరం అందంగా సింధూరం దిద్దుకుంటున్నవేళ.... అరుణ వర్ణపు దినకరుడు లేలేతగా మెరుస్తూ.... ప్రభాత కాంతులకి కొత్త అందాల్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నాడు.

చీకట్లోనే లేచి తలారాస్నానం చేసి జుట్టు చిక్కుతీసుకుంటూ నాగది కిటికీలోనుంచి ఎదురుగా దృష్టి సారించే సరికి నాకళ్ళ బడ్డ దృశ్యం అది.

ఆ దృశ్యం చూడగానే అదో విధమైన ఆనందంతో నిండి పోయింది నా మనసు. ఒక అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యాను.

రోజూ చూసే దృశ్యమే అయినా, ఎప్పటికప్పుడు ఏరోజు కారోజు నిత్యనూతనంగా, నూత్న యవ్వనంలా సరికొత్త అందాల్ని సంతరించుకునే సృష్టిలోని అందాలు నా మనసుకెప్పుడూ ఆనందాన్నే కలుగజేస్తూ వుంటాయి.

నేనీ మాటలు నా స్నేహితురాళ్ళతో చెప్తే వాళ్ళెపుడూ నన్ను వెర్రిదానిలా చూస్తూ వేళాకోళం చేస్తుంటారు.

'ఇంత భావుకత్వం పనికిరాదే తల్లీ!... అయినా అవేవో అందాలో ఆనందాలో... అదేదో నువ్వనుభవించిన దానివి అనుభవించక మధ్యలో మమ్మల్ని చంపటం దేనికీ?.... అయినా వర్షితా! ప్రతిక్షణం ఈ పోటీ ప్రపంచంలో... ప్రతిదానికీ పోటీ పడుతూ పరుగులు తీసేదానికే సమయం చాలని ఈరోజుల్లో 'సూర్యుడు... అందాలు.... లేత వెలుగులు.... ప్రభాతాలు? అంటూ నిద్రలేవగానే వాటిని పరిశీలిస్తూ టైం వేస్ట్ - చేసుకుంటారా?... ఎవరైనా?!"

అంటూ మెత్తగా చివాట్లు పెట్టింది నా స్నేహితురాలు నర్తన ఓసారి.

అదుగో.... అప్పటి నుంచే అసలు వాళ్ళతో చెప్పటమే మానుకున్నాను. నా భావనల్ని.... ఏదయినా... ఏమయినా నేనే మౌనంగా ఆస్వాదించటం, అనుభవించటం అలవరుచుకున్నాను....

అయినా... 'చూడగలిగే మనసుంటే' ప్రతి రోజూ రసరమ్య చంద్రికలు సృష్టిస్తున్న ఈ ప్రకృతి నిత్య నూతనంగా... నూత్న యవ్వనాన్ని సంతరించుకున్న పదహారేళ్ళ పడుచుపిల్లలా మెరిసిపోదూ!?!!!...

* * *

నా ఆలోచనా స్రవంతికి అడ్డుకట్ట వేస్తూ వాల్‌క్లాక్ టైం ఏడుగంటలు కావస్తున్నదని సూచించింది. గబగబా అక్కడి నుంచే కదలబోయాను.

సరిగ్గా అదే క్షణంలోనే ....

ఎందుకే అప్రయత్నంగా.... రోడ్డుకి అవతల వైపున్న పేవ్‌మెంట్ వైపు చూసాను.

యధాప్రకారం ఆ ముసలాయన ఆ రోజు రాత్రంతా మేలుకొని బొమ్మల్ని తీర్చిదిద్దుతూ అందులో నిమగ్నమైవున్నాడు. అప్పుడే ఆ చిన్న గుడారం లాంటి ఇంట్లో నుంచే ఓ ఎనిమిదేళ్ళ పాప బయటకి వచ్చింది.

"తాతా!" పిలిచింది ఆ పావ. పలకలేదతను. బహుశ అందులో లీనమై వుండటమే కారణం కావచ్చు.

"తాతా!!" ఆ ముసలాయన మెడచుట్టూ చేతులు వేస్తూ పిలిచింది ఆ పాప రెండోసారి.

"ఏందమ్ములూ!" చేస్తున్న పని పక్కన పెట్టి ఆ చిన్నపాపని దగ్గరికి తీసుకున్నాడు ఆ తాత.

"నువ్వు రాతిరి నుంచీ బువ్వ తినలేదు గదా తాతా! ఇంకా అట్టాగే కూర్చున్నావేం?... రా.... బువ్వతిని మళ్ళీ ఆ బొమ్మ చేసుకో వచ్చులే..." చేయి పట్టుకొని లాగుతూ అంది ఆ అమ్మాయి. "లేదులే అమ్ములూ... నువ్వు తిను... నేను ఈ బొమ్మ అంతా చేసినాక తింటాలే... ఇంకెంత సేపులే.... తొందరగా అయిపోతోంది లేమ్మా.... నువ్వు పద" అంటూ అమ్ములుని పక్కకి పొమ్మంటూ తన మీదున్న చేతులు తీసాడు ఆ తాత.

ఇంతలో వున్నట్టుండి కళ్ళు నులుముకున్నాడు ఆయన.

"ఏమైంది తాతా! కంట్లో నలక పడిందా?" అడిగింది ఆ అమ్మాయి ఆతృతగా.

"ఆc... ఏదో పడినట్టుంది... పోతుంది లేమ్మా... నువ్వు పద..." కళ్ళు నులుముకుంటూనే అన్నాడాయన.

"ఏదీ.... నన్ను చూడనీ" ఆ అమ్మాయి ఆ తాత కంటి దగ్గర నోరు పెట్టి వుఫ్‌మంటూ ఊదింది.

"ఇంక పోయిందిలే" అంటూ మళ్ళీ తన పనిలో నిమగ్న మయ్యాడా ముసలాయన.

"తాతా! రాతిరంతా నువ్వు నిద్దర పోలేదుకదా!" తాతకళ్ళ వైపే దీర్ఘంగా చూస్తూ అడిగింది ఆ అమ్మాయి.

## హైకూలు

ఉదయించు సూరీడు
పంచభూతాలు కల్పేసాడు
మరి మనుష్యులెపుడు మానవత్వంతో మెలుగునో

మన కష్టాలు భగవంతునికి తెలుసు
మూగజీవుల బాధలు
నా మనస్సుకు తెలుసు

ఎన్ని తినిన రుచించలేదు
నా నాలుక
చిన్ననాటి అమ్మగోటి ముద్దలు తను పొస్తే

చూస్తుండగానే మారిపోతున్నాయి
వాల్‌పోస్టర్ల
బతుకులు

దేహం విడిచిన
దాహం విడువలేదు
కవి రచనలు

అంటికి విలువ కట్టారు
మానవులు
అనురాగ అప్యాతలకు కట్టలేక

**- బొడ్డు గంగాభవాని**

"లేదు లేమ్మా.... నువ్వు పడుకోగానే... నేను వచ్చి పడుకున్నాను.... అబద్ధం చెపుతున్నానని తెలిసీ చెప్పాడు... ఆ తాత... కానీ ఆ అబద్ధాన్ని ఆ కళ్ళు దాచలేక పోయాయి.

"ఏం కాదు... అన్నీ అబద్ధాలే.... ఆ కళ్ళు చూడు... ఎంత ఎర్రగా వున్నాయో?".... 'అబద్ధం చెప్పి దొరికిపోయావ్‌లే' అన్నట్టు చూస్తూ అంది అమ్ములు.

ఇంక తను ఏం చెప్పినా నమ్మదను కున్నాడేమో!... నిజమే చెప్పాడతను.

"నిద్దరపోతే... ఈ బొమ్మ ఎప్పుడు తయారుసెయ్యాల?.... దీన్నెపుడు అమ్మాల?...

రాతిరికి మనకి బువ్వెట్టా సంపాదించా లమ్ములూ?..... అయినా ఒక్క పూటకి నిద్దర మేలుకుంటే నాకేం కాదులే అమ్ములూ...".

నచ్చజెప్తూనే వున్న నిజం చెప్పేసాడు తాత. ఆ మాటలు విన్న ఆ పాప మనసులో ఏ భావాలు చెలరేగుతున్నాయో... మౌనంగా అతని కేసి చూస్తూండిపోయింది.

ఒక్కక్షణం తర్వాత గమనించాడు తాత ఆ పాప కళ్ళల్లో కదిలిన సన్నని కన్నీటి పొరని.

"అమ్ములూ! ఏడుస్తున్నావా?... ఏమైందమ్మా!...." ఆ పాపని దగ్గరికి తీసుకుంటూ అడిగాడు ఆ తాత...

"నేనా?.... లేదు తాతా!... నేనెపుడు ఏడ్చాను?... ఉండు... ఆ కుళాయి దగ్గర నీళ్ళొస్తున్నాయేమో చూసి ముంత నిండా తీసుకొస్తా"నంటూ ఆ గుడారం లాంటి ఇంట్లోకి దూరింది ఆపాప. తాత రాత్రంతా బొమ్మ తయారు చేయటం కోసం మేలుకొనే వున్నాడన్న నిజం ఆ లేతగుండెల్ని కలవరపెట్టింది కాబోలు ఏడుపునాపుకుంటూ.... ఆ తాత చెక్కుతున్న రాధాకృష్ణుల బొమ్మ సగానికి పైగా పూర్తి అయినట్టుంది. 'ఎంత మనోహరంగా ఉందో ఆ బొమ్మ' మనసులోనే మెచ్చుకోకుండా వుండలేక పోయాను.

ఆ పాప నీళ్ళ కోసం చిన్న కడవ లాంటిది తీసుకుని ఆ ఎదురుగా కన్పిస్తున్న కుళాయి దగ్గరికి పోవటం చూసి అప్పుడు దీర్ఘంగా నిట్టూరుస్తూ అనుకున్నాడు ఆ తాత.

"రాత్రింబగళ్ళు అనకుండా కష్టపడు తుంటేనే రెండోపూటకి వెతుక్కునే మన బతుకుల్లో ఇంక రాతిరి నిద్దరబోయి పగలు ఎండలు చంపుతున్నాయని ఊరుకుంటే నాలుగు దినాల కొకసారి కూడా బువ్వతినటం కట్టమే అవుతుంది అమ్ములూ!... ఆ బ్రమ్మదేవుడు ఇట్టారాసి పెట్టాడు మనబతుకులని...ఏం సెయ్యలేం...ఈ బతుకులు ఇట్టా తెల్లా రాల్సిందే... ఈ బతుకులు ఇట్టా పోవలసిందే!..."

ఆ తాత కళ్ళల్లో ఎన్నో ఏళ్ళ ఒడిదుడుకులు దాదాపు అరవై ఏళ్ళకి పైబడ్డ జీవితపు అనుభవాలు రెండూ రెండు కన్నీటి చుక్కల రూపంలో మెరిసాయి అస్పష్టంగా....

ఎందుకో నా గుండె బరువెక్కింది.

అంతలో వాల్‌క్లాక్ టైం ఎనిమిదిన్నర దాటినట్లు చూపించింది. ఆఫీసుకి టైం అయిందనుకుంటూ,భారంగా అక్కడి నుంచే కదిలాను.

* * * *

సాయంత్రం ఆరవుతుండగా ఆఫీసు నుంచే ఇల్లు చేరాను.

ఇంటికి రాగానే నా కళ్ళు అప్రయత్నం గానే పేవ్‌మెంట్‌పై వున్న ఆ తాత ఇంటి వైపు చూసాను. ఎందుకో చాలా మంది గుమిగూడి వున్నారనుకుంటూ ఆశ్చర్యంగా అటు చూశాను. ఆ తాతకి కొంచెం దూరంలో వున్న పెద్దషాపు దగ్గర చాలా మంది హడావిడిగా షాపులోపలికి వెళుతూ కనిపించారు.



మచిలీపట్నం టౌన్‌హాలులో ఆంధ్రసారస్వత సమితి నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభలో డా॥తుర్లపాటి రాజేశ్వరికి కవిత్వ విభాగంలో ఉగాది పురస్కారాన్ని సంస్థ అధ్యక్షులు డా॥బోయిన వెంకటేశ్వరరావు అందిస్తున్న దృశ్యం. చిత్రంలో కార్యదర్శి చిరువోలు రామమోహన్, ఎల్.ఎస్.శాస్త్రి, జె. రాధాకృష్ణలు ఉన్నారు.

"ఏమిటంత సందడి?" హడావిడి చెప్మా?' అనుకుంటూ ఆసక్తిగా పరిశీలించాను. ఆ తర్వాత తెలిసింది విషయమేంటో?....

ఆ షాపులో ఎప్పుడూ మంచి మంచి బుక్స్, సీనరీస్ వుండే క్యాలెండర్స్ లాంటివి అమ్ముతుంటారు. 'ఏవైనా మంచి బుక్స్ వచ్చాయేమో కొత్తగా.... కొనటానికి వెళ్ళుంటారు అందరూ...' అనుకున్నాను.

ఆతర్వాత తెలిసింది అసలు విషయం.

అదే...

కొత్తగా వుండే ఫ్యాషన్ డిజైన్లు చేసిన మోడల్స్ ఫోటోలు వచ్చాయన్న విషయం.

ఇంతలో, ఓ స్ప్లెండర్ ప్లస్ వచ్చి ఆగింది... ఆ తాత ముందు... అందులో నుంచే దిగింది ఓ జంట....ఆమెకి దాదాపు నలభై ఏళ్ళు పైనే వుండొచ్చు... అతనికీ ఓ నలభైఏడు, నలభైఎనిమిది పై చిలుకే వుంటాయి అను కున్నాను నేను. అత్యంత ఆధునికమైన అలంకర ణలో ఆమె - సూటూ - బూటూతో అతను.

నిజం చెప్పాలంటే....

నలభై ఏళ్ళుపైనే వుండే ఆమె స్లీవ్ లెస్ బ్లౌజు, బాబ్డ్ హెయిర్, పేరుకు వంటి మీద చీరున్నా, అది లేనట్టే అన్పించేలా పలుచని జార్జెట్ చీర, దానికి తగ్గట్టు ముందే పిప్పళ్ళ బస్తాకు మారు పేరులా ఆమె శరీరం అన్నీ కలిసి ఆమెను ఎబ్బెట్టుగా కన్పించేలా చేసాయి.

అతని సంగతి సరేసరి....

చెప్పనే అఖ్ఖర్లేదు.. -

అది చాలదన్నట్టు... అప్పుడే పెళ్ళయిన కొత్త జంటలా ఒకళ్ళపై ఒకళ్ళు వాలిపోతూ.... ఆ కాస్తదూరం నడవటానికీ ఆసరాగా ఒకళ్ళనొకళ్ళు ఆనుకుంటూ 'డియర్', 'డార్లింగ్' అంటూ పిలుపులూ, ఎందుకో నాకు సదభిప్రాయం కలిగించలేదు వాళ్ళపై.

అయినా అది చెప్పటానికి నేనెవర్ని?.. ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళుండే హక్కు భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ వుంది కదా!... అనుకుంటూ...వాళ్ళ వైపే చూసాను... ఆ తాత దగ్గరికి వాళ్ళు వెళ్ళటం గమనించి. ప్రొద్దున నేను చూసిన బొమ్మ పూర్తిగా

2005 రామాకవితల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కవిత.

# బతుకుదివిటి

యువ మోర్చా వారి నవ ప్రభ
దే దీప్యమానమై వెలిగె.
ఎలక్ట్రికల్ తారాతోరణాలతో
మందిరాన అమరిన మనోగ్నవేదికపైన
కాకినాడ 'కమల' కాలు దువ్వి,
వేలు విరిసి, రికార్డు డ్యాన్సు వేయందే
రిలాక్స్ కారు జనాలు !
నిశాచర హంతకుడు ఉత్సవరాముని
మనస్సు నిమ్మళించేనా!!
శ్రీరామ నవమి, ఉత్సాహానికి -
వారుణి వాహిని పొట్లాలు తాగి,
బాణా సంచా కాల్చే నల్లమందు నరుడు !
నారికేళం, కర్పూరం ఫ్లస్ కానుక
ఇవ్వనిదే శఠగోపం పెట్టని పూజారి మారుతి !
బారు సరుకు లేనిదే
బూరలు ఊదని భజంత్రీలు !
ఇందరకీ ఇన్ని వనరుల కోసమే,
ఇంటి, ఇంటి చందా, వీధి, వీధి చందా!
మనిషి, మనిషి చందా, మత పెద్దకు భోక్తమైతే !!
మాన్యులకు మిగిలేది చీకటిభవిష్యత్తే కదా !
దివిటీ పట్టిన దీపకునికి
ఎప్పుడూ చీకటే శ్రమ ఫలితమౌతోంది !
ఉత్సవం పూర్తయినా
నిరుత్సాహమే మిగుల్తుంది !

– కోపూరి కోటయ్య

తయారై ముద్దొస్తూ వుంది.

"ఈ రాధాకృష్ణుల బొమ్మెంత?" అడిగిందామె. ఆ బొమ్మ చేతుల్లోకి తీసుకుని అటూ ఇటూ చూస్తూ..."ముప్పై రూపాయలమ్మ గారూ!" నమ్రతగా ఈ ఒక్కబొమ్మ అయినా అమ్ముడైతే ఓ రోజుకు అన్నం దొరుకుతుందని ఆశగా అన్నాడా తాత.

"ఏంటీ?... ఇంత చిన్న బొమ్మ ముప్పై రూపాయలా?" కాస్త వయ్యారంగా అంది ఆమె.. ఇంకొంచెం నిర్లక్ష్యం ఆమె గొంతులో ....

అవునమ్మగారూ!...

ఇది చూడటానికి చిన్న బొమ్మే అయినా.. ఎంతెంత దూరం నుంచో ఆ మట్టి తెచ్చుకొని.... రంగులు కొనుక్కొని..... రాత్రిం బగళ్ళు - కష్టపడితే గానీ ఒక్కబొమ్మ తయారు కాదమ్మగారూ!... పెద్ద వారు... గొప్పోరు.... మీకు తెలీందేముందమ్మా.... ప్రాధేయపూర్వకంగానే అందులో కష్టనష్టాలు తెలుపుతూ....అన్నాడా తాత....

వాళ్ళు కూడా ఒక్క బొమ్మ నయినా కొనకుండా ఎక్కడ వెళ్ళిపోతారో అన్న భయం, నిరాశా ఆ తాత గొంతులో కన్పించకనే కన్పిస్తున్నాయి.

కాని, ఆ తాత పిచ్చి గానీ, ఇవన్నీ వాళ్ళ కెందుకు చెప్పండి?... కానీ....ఆ తాత ముఖంలో కనిపించే భావాల్ని బట్టి పొద్దుటనుంచే కాదు అంతకు ముందు రెండు రోజుల నుంచీ కూడా ఏ ఒక్క బొమ్మ కూడా ఎవరూ కొనలేదన్న విషయం తెలుస్తూనే వుంది... ఆ తాత పక్కనే ముడుచుకుని వాడిపోయిన ముఖంతో కూర్చున్న ఆ పాప ముఖం పొద్దుటి నుంచీ అన్నం తినలేదన్న నిజం చెప్తోంది మౌనంగా.

నా గుండె తరుక్కుపోయింది.

ఆమె ఆ బొమ్మని చూస్తూ చూస్తూ పక్కనే వున్న ఆ షాపువైపు చూసి ఏదో కొంప లంటుకున్నట్టు కేక పెట్టింది. "డియర్...సీ దేర్".

అతను ఆ వైపు చూసాడు.

ఏమిటో.....అంతగా చూపిస్తోం దేమిటా?...అని నేను ఆవైపు చూసాను అప్రయత్నంగానే.

ఎదురుగా........

'అర్ధనగ్నంగా కొత్తగా డిజైన్ చేసిన డ్రెస్‌లో అందంగా కవ్విస్తూ వున్న ఓ పద్దెనిమి దేళ్ళ మోడల్ గర్ల్, ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసి స్టైల్‌గా నిలుచున్న ఓ యంగ్‌మాన్ వుండే ఫొటో కన్పించింది.

"అది వెంటనే కొనాలి. ఎంత బావుందో?"

దాదాపు అతన్ని లాక్కెళుతూ అంది ఆమె.

"ఓకే... ఓకే.... వెళదాం మరి ఆ బొమ్మ సంగతి?" ఏదో ఒకటి తేల్చమన్నట్టు అన్నాడతడు.

"అక్కడంత నైస్ పిక్చర్ కనిపిస్తుంటే... ఈ మట్టిబొమ్మ నాకెందుకు?"

అంటూ విసురుగా తీసుకున్న ఆ బొమ్మ కింద పెట్టబోయింది. కానీ ఆ విసురుకి అది పగిలిపోయింది.

పట్టించుకోకుండానే వెళ్ళిపోయిందా జంట.

ఆ క్షణంలో ఆ తాత ముఖంలోకి చూసిన వాళ్ళెవరయినా ఇంకెప్పుడూ జీవితంలో ఏ వ్యక్తి పట్లా అంత దురుసుగా ప్రవర్తించటానికి సాహసించరేమో!.....

రాత్రింబగళ్ళు విరామమెరుగక శ్రమించిన ఈ అపరబ్రహ్మ సృష్టించిన బొమ్మ మట్టిలో కలిసింది.

కానీ...

ఆ బ్రహ్మ సృష్టించిన ఈ బొమ్మ...

పరిస్థితి తెలుసుకున్న నేను గిన్నెలో అన్నం తీసుకెళ్ళి తాత చేతికిచ్చాను.... ఆ గాజు కళ్ళల్లో కృతజ్ఞతా పూర్వక మెరుపులు కూడా కన్పించనివ్వలేదు. తొణికిన కన్నీళ్ళు.

ఆ పాప విచిత్రంగా చూసింది నన్ను. సన్నగా నవ్వాను నేను....ఏడవలేక... ఒక్కరోజు పెట్టగలను రోజూ పెట్టగలనా?....

"బొమ్మల్ని సృష్టించే అపర బ్రహ్మలు---
ఆ బ్రహ్మ చేతిలో బొమ్మలు"
మౌనంగా ఆక్రోశించింది నా మనసు....